మార్పు కోసం ...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి కేంద్రాలుగా నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడిటేషన్ కలిగిన)
తెలుగు దినపత్రికకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని అన్ని జిల్లాలకు ఇన్‌చార్జులు నియోజకవర్గ, మండలాలకు విలేకరులు కావలెను.
మరిన్ని వివరాలకు సంప్రదించండి..
సెల్ : 91548 42842

ప్రచురణ : హైదరాబాద్, కమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి / చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ / సంపుటి : 5 సంచిక : 113/ ఆదివారం 12 నవంబర్ 2023 / పేజీలు : 4 / వెల రూ.5/-

## ప్రధాని మోదీ సంచలన ప్రకటన



హైదరాబాద్ నవంబర్ 12, మరోఉదయం : తెలంగాణ ఎన్నికల వేళ సంచలన ప్రకటనకు ప్రధాని మోదీ సంచలన ప్రకటనకు సిద్ధమయ్యారు. ఇప్పటికే బీసీ సీఎం నినాదంతో బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తెలంగాణ ఎన్నికల పోరు ప్రధానంగా కాంగ్రెస్ వర్సస్ బీఆర్ఎస్ మధ్య సాగుతున్న వేళ..సామాజిక సమీకరణాలో గేమ్ తమ వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు హైదరాబాద్ వేదిక కానుంది. బీజేపీ వేస్తున్న వ్యూహాత్మక ఎత్తుగడలతో బీఆర్ఎస్ – కాంగ్రెస్ ను ఆత్మరక్షణలోకి నెట్టే విధంగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ అస్త్రం: అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించిన బీజేపీ నాయకత్వం మరో సంచలన నిర్ణయానికి సిద్ధమైంది. శనివారం సికింద్రాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 'అణగారిన వర్గాల విశ్వరూప మహాసభ'కు ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఈ వేదికపై నుంచే ఎస్సీ వర్గీకరణపై కీలక నిర్ణయాన్ని మోదీ ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని, దీనిపై వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతామని, అవసరమైతే రాజ్యాంగ సవరణ కూడా చేస్తామని ప్రధాని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లో బీసీల సభకు మోదీ వచ్చిన సందర్భంగా ఆయనతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ భేటీ అయ్యారు. ఆ సమయంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించారు. షెడ్యూలు కులాల వర్గీకరణపై మోదీ కొంత సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. బీసీ ముఖ్యమంత్రి నినాదంతో పాటుగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత అంశం హామీ తెలంగాణ రాజకీయాల్లో పెనుమార్పులకు శ్రీకారం చుట్టనుందని బీజేపీ అంచనా వేస్తోంది. ఈ నినాదాలతో రాష్ట్రంలో తమ ఓటు బ్యాంకు గణనీయంగా పెరుగుతుందని బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీసీ, ఎస్సీల సమస్యలను పరిష్కరించే దిశగా తీసుకోనున్న చర్యలపై ప్రకటనలు చేస్తే అది ప్రత్యర్థి పార్టీలను ఇరకాటంలో పడేస్తుందని, వారికి విమర్శలు చేసే అవకాశం ఉండదని ముఖ్యనేతలు భావిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణ–చట్టబద్ధత అంశంపై పార్టీలో అంతర్గతంగా గత ఐదు నెలలుగా కసరత్తు జరిగిందని, ఆ తర్వాతే ప్రధాని కీలక ప్రకటనకు రంగం సిద్ధమైందని తెలుస్తోంది. తెలంగాణాలో ఎస్సీల ఓట్లు 18శాతం ఉండగా.. అందులో 14శాతం మాదిగలే. ఇందులో ఒకటి, రెండుశాతం పోయినా, మెజారిటీ మాదిగలు తమకే అండగా ఉంటారని బీజేపీ నేతలు విశ్లేషిస్తున్నారు. తెలంగాణ ఎన్నికల వేళ సంచలన ప్రకటనకు ప్రధాని మోదీ సంచలన ప్రకటనకు సిద్ధమయ్యారు. ఇప్పటికే బీసీ సీఎం నినాదంతో బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తెలంగాణ ఎన్నికల పోరు ప్రధానంగా కాంగ్రెస్ వర్సస్ బీఆర్ఎస్ మధ్య సాగుతున్న వేళ..సామాజిక సమీకరణాలో గేమ్ తమ వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు హైదరాబాద్ వేదిక కానుంది. బీజేపీ వేస్తున్న వ్యూహాత్మక ఎత్తుగడలతో బీఆర్ఎస్ – కాంగ్రెస్ ను ఆత్మరక్షణలోకి నెట్టే విధంగా అడుగులు వేస్తున్నారు.

## ఒక్క రూపాయికే నాలుగు గ్యాస్ సిలిండర్లు!



హైదరాబాద్ నవంబర్ 12, మరోఉదయం : తెలంగాణలో ఎన్నికల వాతావరణం వెడెక్కింది. శుక్రవారంతో నామినేషన్ల పక్రియ పూర్తి కాగా.. మొత్తం 119 నియోజకవర్గాలకు 1100లకు పైగా అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారు. అధికార బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ లాంటి ప్రధాన పార్టీలతో పాటు పలు చిన్నాచితకా పార్టీలు, స్వతంత్రులు బరిలోకి దిగుతున్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్ని పార్టీల అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమైనటువంటి ఎన్నికల మేనిఫెస్టోను పార్టీలు విడుదల చేస్తున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకునేలా పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటిస్తున్నాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామంటూ కాంగ్రెస్, రూ.400లకే ఇస్తామంటూ బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించాయి. అయితే.. ఓ జాతీయ పార్టీ గ్యాస్ సిలిండర్లపై సంచలన ప్రకటన చేసింది. తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయికే ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున కుమ్మరి వెంకటేష్ యాదవ్ సనత్‌నగర్ నుంచి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆయన.. తాము అధికారంలోకి వస్తే కేవలం రూపాయికే ఏడాదికి నాలుగు గ్యాస్ సిలండర్లు ఇస్తామని ప్రకటించారు. అంతే కాకుండా.. రూపాయికే ఉచిత విద్య, రూపాయికే వైద్యం, రూపాయికే న్యాయ సలహాలిస్తానని హామీలు ఇచ్చారు.

## 'నాకాడైతే పైసల్ లేవు.. మీరే నా ఆస్తి'



హైదరాబాద్ నవంబర్ 12, మరోఉదయం : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ పక్రియ ముగిసింది. దీంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరుగుతూ ఓటరు దేవుళ్లను ప్రస్నన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికార పక్షం నేతలు ప్రతిపక్షాలను టార్గెట్‌గా చేసుకొని విమర్శలు చేస్తూ ప్రచారాన్ని సాగిస్తుండగా.. ప్రతిపక్షాల అధికార పక్షం లోపాలను ఎత్తిచూపుతూ జనంలోకి వెళుతున్నారు. మరికొందరు సెంటిమెంట్‌తో ఓట్లను పొందేందుకు రాబట్టేందుకు యత్నిస్తున్నారు. ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం గ్రామాల్లో తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఆమె కాస్త ఎమోషనల్ అయ్యారు. తన వద్ద పైసలు లేవని.. ప్రజలే తన ఆస్తి అని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. 'నియోజకవర్గ ప్రజలందరికీ నేను ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా. నా దగ్గర డబ్బులు లేవు.. నా దగ్గరున్నదల్ల మీరే. నాకు అవ్వ, తండ్రి, తమ్ముడు, నాన్న అన్నీ మీరే. నాకాడైతే పైసల్ లేవు. మా నాన్న నాకు విడిచిపెట్టింది. కేసీఆర్ సంపాదించి పెట్టింది మిమ్మల్నే. మీరే నాకు ఓట్లేసి గెలిపిస్తరని కోరుకుంటున్నా. ప్రత్యర్థులు రకరకాల మాటలు మాట్లాడుతున్నరు డబ్బు సంచులు అని అంటున్నారు. నా దగ్గర పైసల్ లేవు. అవన్నీ రాజకీయంగా పబ్బం గడుపుకోవటానికే చేస్తున్న ప్రచారం.

## యాదాద్రి కలెక్టరేట్ లో కత్తిపోట్ల కలకలం




యాదాద్రి నవంబర్ 12, మరో ఉదయం : యాదాద్రి కలెక్టరేట్ కార్యాలయంలో కత్తిపోట్లు కలకలం రేపాయి. ఏఈవో మనోజ్‌పై ఏవో శిల్ప కతితో దాడికి దిగింది. మనోజ్‌కు మెడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఆఫీసులో శుక్రవారం కత్తి పోట్లు కలకలం సృష్టించాయి.విధుల్లో ఉన్న ఓ మహిళా ఉద్యోగిని కత్తితో మరో సహోద్యోగిపై కత్తితో దాడి చేసింది.ఈ దాడిలో ఆ ఉద్యోగి మెడ,వీపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి.దాడికి గల కారణాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఆఫీసులో నర్ర శిల్ప అగ్రికల్చర్ ఆఫీసర్ గా పని చేస్తుంది.శిల్ప కు 2012 లో సుధీర్ అనే వ్యక్తితో వివాహం కాగా వీరికి రెండేళ్ల బాబు కూడా ఉన్నాడు.కాగా గత రెండేళ్లుగా శిల్ప భర్త సుధీర్ కు దూరంగా ఉంటుంది.అయితే కావిడ్ సమయంలో భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో ఉద్యోగం చేసే మనోజ్ అనే వ్యక్తితో శిల్ప కు పరిచయం అయి ఇద్దరి మధ్య శారీరిక సంబంధం ఏర్పడింది.ఆ సమయంలోనే తీసుకుంది. అయితే ఈ వ్యవహారమంతా భర్త సుధీర్ కు తెలవడంతో పలు మార్లు మందలించాడు. ఈ విషయమంతా కలక్టరేట్ లో ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో కొన్ని నెలల పాటు వీరిద్దరినీ సస్పెండ్ చేశారు. అప్పుడు కూడా వీరి మధ్య శారీరిక సంబంధం అలానే కొనసాగింది. తద్వారా మళ్ళీ శిల్ప గర్భం దాల్చడంతో వైద్యుల సహకారంతో గర్భాన్ని నిర్వీర్యం చేసుకుంది. మళ్ళీ ఈ విషయమంతా భర్త సుధీర్ చేవున నిర్ణయించుకున్నాడు. ఇటు శిల్ప సైతం భర్త సుధీర్ కు విడాకులు ఇచ్చేందుకు సిద్ధం అయింది. ప్రియుడు మనోజ్ కూడా విడాకులు ఇచ్చి తనతో రమ్మని చెప్పాడు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పుడు శిల్ప,మనోజ్ ల మధ్య చిన్న చిన్న ఘర్షణలు ఏర్పడ్డాయి. ప్రియుడు మనోజ్ రెండు నెలల పాటు ఉద్యోగానికి లీవ్ పెట్టి కనిపించకుండా పోయి తిరిగి శుక్రవారం ఆఫీస్ కు రావడంతో ఇన్ని రోజులు తీవ్ర మనస్థాపం చెందిన శిల్ప మనోజ్ ను ఎక్కడికి వెళ్లావని నిలదీసింది.ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి పెద్ద ఘర్షణకు దారి తీసింది. ఫలితంగా తీవ్ర ఆగ్రహంతో శిల్ప కత్తితో మనోజ్ మెడ,వీపు భాగంలో దాడి చేసింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.స్పందించిన తోటి ఉద్యోగులు మనోజ్ ను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.సమాచారం అందుకున్న పోలీసులు మహిళపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మునుగోడులో కాంగ్రెస్ షాక్.. కోమటిరెడ్డికి ఓటమి తప్పదా?



హైదరాబాద్ నవంబర్ 12, మరోఉదయం : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. మునుగోడు నియోజకవర్గ ఇంఛార్జ్ పాల్వాయి స్రవంతి పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు అదిష్టానానికి నాలుగు పేజీల లేఖను పంపించారు. పార్టీలో ప్రాధాన్యత తగ్గటంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, మునుగోడు ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఆమె ఓటమి పాలయ్యారు. అనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల్లో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ కేటాయించింది. దీంతో ఆమె అప్పటి నుంచి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. పార్టీ మారుతున్నట్లు గతంలోనే వార్తలు వచ్చినా.. ఎప్పటికప్పుడూ వాటిని ఖండిస్తూ వచ్చారు. అయితే తాజాగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. నేడో రేపో ఆమె మంత్రి కేటీఆర్ సమక్షంలో కారెక్కనున్నారు. ఇక నియోజకవర్గంలో ఆమెకు పట్టుంది. ఆమె తండ్రి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి మునుగోడు నియజకవర్గం నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన తర్వాత రాజకీయ వారసురాలిగా స్రవంతి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవటంతో ఆమె రెబల్‌గా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆమెకు 27 వేల ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత జరిగిన 2018 ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. ఇక 2022లో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో అక్కడ ఉప ఎన్నిక జరిగింది. ఆ ఉప ఎన్నికల్లో పోటీ చేసిన స్రవంతి 22 వేలకు పైగా ఓట్లు సాధించారు. నియోజవర్గంలోని గ్రామాల్లో ఆమె కుటుంబానికి ప్రత్యేకంగా అభిమానులు ఉన్నారు. గోవర్ధన్ రెడ్డి వర్గంగా చెప్పుకునే నేతలు ఇప్పటికీ ఉన్నారు. చివరి వరకు గోవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. ఇక పాల్వాయి స్రవంతి పార్టీ మార్పుతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కొత్త తలనొప్పులు మొదలయ్యాయి. ఆమెను అభిమానించే నాయకులు చాలా మంది బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రమాదం ఉంది. దానికి తోడు ఇటీవల కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి మీటింగ్‌లో కోమటిరెడ్డికి వ్యతిరేకత ఎదురైంది. మళ్లీ కాంగ్రెస్‌లోకి ఎందుకు వచ్చారంటూ కొందరు నేతలు ఆయన్ను నిలదీశారు. ఇవన్నీ చూస్తుంటే ఈసారి కోమటిరెడ్డికి ఓటమి తప్పేలా లేదని కొందరు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## రసవత్తరంగా వరంగల్ తూర్పు రాజకీయం



హైదరాబాద్ నవంబర్ 12, మరోఉదయం : తెలంగాణలో ఎన్నికల తేదీ దగ్గరపడుతున్నకొద్దీ రాజకీయం హీటెక్కుతోంది. వరంగల్ తూర్పు రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇక్కడ అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య టఫ్ ఫైట్ నడుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేగా నన్నపునేని నరేందర్ ఉండగా.. ఈసారి మూడు రంగుల జెండా ఎగురవేయాలని కొండా సురేఖ ఉవ్విలూరుతున్నారు. ఇందులో భాగంగా వ్యూహాలకు పదును పెడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థిని ఓడించటమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. నరేందర్‌పై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకునుందేకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా అధికార పార్టీకి చెందిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొషన్ లో కీలక నేతలైన డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ దంపతులతో పాటు మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్ధన్, కార్పొరేటర్లు గుండేటి నరేందర్, రామ తేజస్వి శిరీష్, మాజీ కార్పొరేటర్ బాసని చంద్రశేఖర్, జార్తి రమేష్‌లతో పాటు మరికొందరు ముఖ్య నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం (నవంబర్ 10) రాత్రి హైదరాబాద్‌కు వీరందరిని తరలించారు. డిప్యూటీ మేయర్‌తో పాటు నలుగురు కార్పొరేటర్లకు టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పేందుకే వారిని తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, కార్పొరేటర్లను రాత్రికిరాత్రే హైదరాబాద్ షిఫ్ట్ చేయడం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నన్నపునేనికి మొదట్నుంచి వ్యతిరేక పవనాలే వీస్తున్నాయి. టికెట్ ప్రకటించిన మరుక్షణమే పలువురు కార్పొరేటర్లు ఆయనకు వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలకు దిగారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్నపునేని ప్రకటించవద్దని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అ తర్వాత అధిష్ఠానం జోక్యం చేసుకొని సర్ది చెప్పినా.. అప్పుడు పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. పోలింగ్ దగ్గర పడుతున్న వేళ కీలక నేతలు పార్టీని వీడటం నన్నపునేనికి ఎదురుదెబ్బ అనే చెప్పాలి.

# అడిగిన వారందరికీ ఇసుక అందించాలి: సిపిఎం

గుంతకల్లు, నవంబర్ 12, మరోఉదయం : ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్న పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ఇసుకను అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న ఇసుక రీచ్‌ను సిపిఎం నాయకులు పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో జగనన్న ఇల్లు కట్టుకునే వారికి కూపన్ ద్వారా ఇసుక పంపిణీ చేయడం లేదన్నారు. హౌసింగ్ అధికారులు ఇచ్చిన కూపన్లు చూపించినప్పటికీ ఇసుక పంపిణీ చేయడం లేదన్నారు. ఇక బయట ఇల్లు కట్టుకునే వారు ఇసుక కోసం దరఖాస్తు చేసుకుంటే ఇచ్చే పరిస్థితి కనపడడం లేదన్నారు. అదేమని అడిగితే టెండర్ పూర్తయిందని కొత్త టెండర్ తీసుకున్నవారు వేస్తారని కాలం గడుపుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, రామునాయక్, చరణ్, వెంకీ, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు తీరని అన్యాయం



కడప, నవంబర్ 12, మరోఉదయం : రాష్ట్ర జనాభాలో 55 శాతం ఉన్న బిసిల ఓట్లతో గద్దెనెక్కిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారికి తీరని అన్యాయం చేశారని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి నిమ్మల కృష్ణప్ప విమర్శించారు. నగరంలోని కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో టిడిపి బిసి విభాగం ఆధ్వర్యంలో బిసిలకు ప్రభుత్వ నమ్మక ద్రోహం పై, బిసి కుల సంఘాలు, అఖిలపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి బిసి కులాలను ఉద్ధరించినట్లు కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తాననని ప్రజలను నమ్మబలికి ద్రోహం చేశారని వాపోయారు. జగన్‌పై అక్రమార్జన కేసులు ఉన్నాయి కాబట్టే కేంద్రాన్ని ప్రత్యేక హోదాపై నిలదీయలేని పరిస్థితి అన్నారు. దాడి చేసి, రాళ్లు రువ్వితే వారికి మంత్రి పదవులిస్తున్నారని విమర్శించారు. టిడిపి పాలనలో 9 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, నిధులు ఇచ్చి బిసిల ఆర్థిక ఎదుగుదలకు ప్రోత్సహించామని ఆయన గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్న నాయకులకు ఎంతో గౌరవం ఉండేదని, జగన్ ప్రభుత్వంలో గౌరవం ఏమాత్రం లేదన్నారు. ఎన్‌టి రామారావు బిసిల రాజకీయ ఎదుగుదలకు అవకాశం ఇచ్చారని, చంద్రబాబు అదే కోవలో కల్పించారని, బిసిల ఐక్యతతో టిడిపిది గెలిపించి రాజకీయంగా ఎదగాలని ఆయన అన్నారు. అనంతరం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2019లో పాలిచ్చే ఆవును కాదని, తన్నే దున్నను తెచ్చు కున్నామని చెప్పారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేశారే కానీ ఆ కార్యాలయాల్లో కుర్చీ కూడా లేదన్నారు. జగన్ నిరంకుశ పాలనను బిసిలు అర్థం చేసుకున్నారని అన్నారు. టిడిపి హయాంలో బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగారన్నది గుర్తుంచుకోవాలన్నారు. టిటిడి మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ బిసిల పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఉమ్మడి జిల్లా జనసేన ఇన్చార్జ్ సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ బిసిలనుఓటు బ్యాంకుగా రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ యాదవ్, టిడిపి రాష్ట్ర నాయకులు గోవర్ధన్, హరిప్రసాద్, లోక్‌సత్తా పార్టీ దేవర శ్రీకృష్ణ, టిడిపి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, అఖిలపక్ష పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర : కలెక్టర్



రాయచోటి, నవంబర్ 12, మరోఉదయం : ఎన్నికల్లో సెక్టో రల్ అధికారుల పాత్ర కీలకమని, వారి కేటాయింపులో జాప్యం ఉండకూడదని, పోలింగ్ కేంద్రాల వారీగా ఇపి రేషియో, జెండర్ రేషియోలలో తప్పులు ఉండరాదని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. సెక్టోరల్ అధికారుల కేటాయింపు, రూట్ మ్యాపులు, లాజిస్టిక్ అవసరాలు, శిక్షణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఇబ్బందికర కేంద్రాల గుర్తింపు, ఇపి రేషియో, జెండర్ రేషియో, నియోజకవర్గ ఎన్నికల మేనేజ్మెంట్, ప్రత్యేక ప్రచార రోజులు, ఎన్నికలకు సంబంధించిన ఫారం లను త్వరగా క్లియర్ చేయడం వంటి అంశాలపై ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారుల కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలు కొన్ని నియోజకవర్గాల నుంచి రాలేదని, వాటిని త్వరగా పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క సెక్టోరల్ అధికారికి 6 పోలింగ్ స్టేషన్ల కంటే ఎక్కువగా కేటాయింపు ఉండకూడదని సూచించారు. ఒక్కొక్క రూటుకు ఒక్కొక్క సెక్టోరల్ అధికారిని కేటాయించేలా చూసుకోవాలని సూచించారు. వచ్చే మంగళవారానికల్లా సెక్టోరల్ అధికారుల కేటాయింపు పూర్తవ్వాలని ఆదేశించారు. లాజిస్టిక్ అవసరాలకు గురించి మాట్లాడుతూ... వాహనాల కేటాయింపు తదితర అంశాలను కూలంకషంగా పరిశీలించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని, వారికి ఏ ఏ పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇపి రేషియో మరియు జెండర్ రేషియోలలో ఎటువంటి తప్పులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చనిపోయిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలు ఉండకూడదని ఆదేశించారు. బిఎల్‌ఓల సహకారంతో తహశీల్దార్లు, ఇఆర్‌ఓలు ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. నియోజకవర్గ ఎన్నికల మేనేజ్మెంట్ లోని వివిధ అంశాలను పక్కాగా అమలు పరచాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా పై ప్రత్యేక శిబిరాల గురించి వీధుల్లో టామ్ టామ్ చేయించాలని,ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం జరగాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఓ సత్యనారాయణ, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

# బ్రౌన్‌పై మరింత లోతైన పరిశోధన : విసి



కడప, నవంబర్ 12, మరోఉదయం : సి.పి.బ్రౌన్ జీవిత సాహిత్యాలపై ఇదివరకు జరిగిన పరిశోధనల కంటే మరింత లోతైన పరిశోధన అవసరం ఉందని, ఆ దిశగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో అధ్యయనం కొనసాగుతుందని యోగివేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 225వ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విసి ముందుగా పరిశోధన కేంద్రం ప్రాంగణంలోని సి.పి. బ్రౌన్, డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సి.కె.సంపత్ కుమార్ విగ్రహాలకు అతిథులతో కలసి సమావేశమందిరంలోని సి.పి.బ్రౌన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ సి.పి.బ్రౌన్ ఉద్యోగరీత్యా మొట్ట మొదట అడుగుపెట్టిన స్థలం కడప కావడం విశేషమని, ఆయన కలెక్టరుకు సహాయకులుగా పనిచేస్తున్నప్పుడే తెలుగు భాషపై పట్టు సంపాదించారన్నారు. ఆయన రెండవసారి ఉద్యోగరీత్యా కడపకు వచ్చినప్పుడు 15 ఎకరాల తోటను, బంగళాను కొని, సుమారు 15 మంది పండితులను పోషించి కడప గడపలోనే ఆయన సాహిత్య యజ్ఞాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య రాణి సదాశివ మూర్తి, రాయలసీమ ఉద్యమకారుడు భూమన్, తెలుగుశాఖ అధ్యాపకురాలు ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి, పాల్గొన్న అతిథులను, గ్రంథాలయ నిత్యపాఠకులు కొత్తపల్లి రామాంజనేయులు, ఎ.బాలయ్య, భూపతి రాయల్‌లను నిర్వాహకులు పాల్గొన్నారు.

**వేంపల్లె :** ఆంగ్లేయుడైన సిపి బ్రౌన్ తెలుగు భాషోద్ధారకుడని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపి బ్రౌన్ 225వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కడపలోని బ్రౌన్ ఇంటిని బ్రౌన్ గ్రంథాలయంగా మార్చారని పేర్కొన్నారు. బ్రౌన్ గ్రంథాలయానికి నిధులు విడుదల చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

# సంక్షేమ పథకాల అమలులో వైసిపిదే అగ్రస్థానం



ములకలచెరువు, నవంబర్ 12, మరోఉదయం : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ప్రభుత్వం పెద్దపీఠ వేస్తోందని మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, మంత్రులు ఉషశ్రీచరణ్, నాగార్జున అన్నారు. ములకలచెరువులో సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనిల్‌మారయాదవ్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు 50శాతం పైగా రాజకీయ పదవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2024లో మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని అన్నారు. రాష్ట్రంలో 156 సామాజీక కులాలు ఉన్నాయని, వారందరికి న్యాయం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. అనంతరం మంత్రి నాగార్జున, ఉషశ్రీచరణ్‌లు మాట్లాడుతూ గత నాలుగన్నరేళ్ల వైసిపి పాలనలో అవినీతికి తావు లేకుండా పరిపాలన చేస్తున్నారన్నారు. 35 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీకలు రూ.1018 కోట్లు జగన్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నాడు లేని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథకంలో నడిపించన ఘనత పెద్దిరెడ్డి కుటుంబాకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజాన్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ రఘురాం, జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండఖలీల్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజనీసురేంద్ర, మండల కన్వీనర్ మాధవరెడ్డి, మాజీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవింద్రారెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి పెద్దపీట : చింతల



కలకడ, నవంబర్ 12, మరోఉదయం : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కొనియాడారు. మండలంలోని నడిమిచర్ల పంచాయతీ కొత్తపల్లి నడిమిచర్ల చిన్న మొటుకు అడవిలో మాదిగపల్లె గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సంక్షేమ పథకాలు సక్ర మంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు అధికారులు చేరువుగా ఉండేటట్లు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటరీ వ్యవస్థ స్థాపించి ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ధృవీకరణ పత్రాలు కోసం మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగే వారని ఇప్పుడు అలా కాకుండా గ్రామ సచివాలయాల్లోనే ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాడు-నేడు పథకం పాఠశాల రూపురేఖలు మార్చి విద్య వ్యవస్థ నూతన ఒరవడికి నాంది పలికారని చెప్పారు. గత ప్రభుత్వం కంటే పింఛన్లను ఎక్కు వగా ఇచ్చిన ఘనత కూడా సిఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవిరవికుమార్, మండల పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, ఆర్‌బికె మండల కన్వీనర్ హరినాద్‌రెడ్డి, ఎంపిటిసి కృష్ణారెడ్డి, సర్పంచులు లింగమ్మ, రాజ గోపాల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ ప్రదీప్, ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి, ఎంఇఓ మునీంద్రనాయక్, ఎపిఓ చెన్నకేశవులు, ఎపిఎం రమేష్, ఎస్ఐ తిప్పేస్వామి, ఎఎస్ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

**పుల్లంపేట :** మండల పరిధిలోని రామసముద్రం గ్రామ సచివాలయ పరిధిలోని గొల్లపల్లి, రామసముద్రం దళితవాడ కుమారునిపల్లి సచివాలయ పరిధిలోని దళితవాడ, కోనయ్య గారి పల్లి, కోనయ్య గారి పల్లి హరిజనవాడ, అరుంధతి వాడ తదితర గ్రామాల మీదుగా ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ పభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాసమస్యలు తెలుసుకొని సమస్యలకు పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో విజరు కుమార్ రెడ్డి, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, స్టేట్ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి, సర్పంచ్ పిచ్చిరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, తాసిల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఓరఘురాం పాల్గొన్నారు.

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి



ఎమ్మిగనూరు, నవంబర్ 12, మరోఉదయం : పాలస్తీనాపై ఇజ్రాయిల్ నిరంతరం కొనసాగిస్తున్న మారణకాండను తక్షణమే ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల కార్యదర్శి బి.రాముడు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాలస్తీనాపై దాడుల వల్ల 10 వేల మంది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. తక్షణమే ఇజ్రాయిల్ సైన్యం కాల్పులు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రాజు, షబ్బీర్, ఆది, నాగరాజు, తిక్కయ్య, ఈరన్న గౌడ్ పాల్గొన్నారు.

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి




రాయచోటి, నవంబర్ 12, మరోఉదయం : ఆత్మరక్షణ పేరి ట పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని తక్షణ మే ఆపాలని, కాల్పుల విరమణ అమలు చేయాలని, గాజాలో చిన్నారులు, మహిళలకు రక్షణ కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు సగిర్ డిమాండ్ చేశారు. పాలస్తీనాకు మద్దతుగా వామ పక్షాల రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు రాయచోటి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. యుద్ధం వద్దు ప్రపంచ శాంతిని నెలకొల్పాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని నిరదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాలస్తీనా గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు కారనంగా మహిళలు పసిపిల్లలు వేలాది మంది ప్రాణాలను పోగొట్టుకున్నారని తెలిపారు. పాలస్తీనా ప్రజలపై యూదుల దురహంకారాన్ని ఇజ్రాయిల్ ప్రదర్శిస్తోందని విమర్శించారు. గాజాలో కిరాతకమైన రీతిలో మారణహోమం సాగిస్తోందని, శరణార్థి శిబిరాలు, ఆసుపత్రులపై దాడులు చేస్తున్నారన్నారు. తక్షణమే కాల్పుల విరమణ అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకులను హింసించడం, వేదించడం చంపేయడం ద్వారా సమస్య తీవ్రతరం అవుతుందేకానీ సమస్యలు పరిష్కారం కాదన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా దాని మిత్ర దేశాలు ఆర్థిక, సైనిక, సాయుధ సహాయాన్ని అందిస్తుండటం ఆక్షేపణీయమన్నారు. కాల్పుల విరమణ కోసం స్వరం పెంచడం అనివార్యం అన్నారు.ఇందుకు భారతీయులంతా కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్, సిపిఎం నాయకులు డిసి వెంకటయ్య, నాగబసిరెడ్డి, మాధవయ్య, రెడ్డెయ్య, శేఖర్ నాయక్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుదీర్ కుమార్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

**మదనపల్లె :** పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని కండిస్తూ సిపిఐ, జై భీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అనిబిసెంట్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు మురళి, కొన భాస్కర్, తిరుమల, సూరి, మాధవ్, వాసు, ఓబులేసు పాల్గొన్నారు.

**మొలకలచెరువు :** పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిపిఐ నాయకులు నిరసన తెలిపారు. కార్యాక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అంజనప్ప, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్, లక్ష్మీదేవి, అమరావతి, సుబ్బన్న, శివప్ప, రమణప్ప, కుత్తన్న, నరసింహులు, వేమ నారాయణ, చౌడప్ప, ఆనంద, కదిరప్ప పాల్గొన్నారు.

# ఎస్‌పి కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య



రాయచోటి, నవంబర్ 12, మరోఉదయం : కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యతో తీవ్ర మనస్థాపానికి గురై తాను పని చేస్తున్న కార్యాలయంలోనే ఓ కానిస్టేబుల్ శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ఎస్‌పి కార్యాలయంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...కడప జిల్లా పోరుమామిళ్ల మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన కవలకుంట్ల రవి అనే 2009 బ్యాచ్‌కు చెందిన సివిల్ కానిస్టేబుల్ సంవత్సరం నుంచి అన్నమయ్య జిల్లా ఎస్‌పి కార్యాలయంలోని డిసిఆర్‌బి అనే ఓవింగ్‌లో పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా రవి కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యతో బాధపడుతూ తీవ్ర మనస్థాపానికి గురై తాను పని చేసే కార్యాలయంలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సొంత ఊరులో ఉండడంతో రవి ఎస్‌పి కార్యాలయంలోనే ఉంటూ హోటల్‌ల్లో తింటూ ఆఫీసులోనే నిద్రిస్తూ వచ్చారు. తెల్లవారిన కూడా ఆఫీసు తలుపులు తీయకపోవడంతో కార్యాలయానికి వచ్చిన తోటి సిబ్బంది తలుపును ఇనుప రాడ్డు సహాయంతో బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూసే సరికి కానిస్టేబుల్ రవి ఉరి వేసుకొని వేలాడుతూ ఉన్నాడు. వెంటనే సిబ్బంది కిందకు దింపి హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిక్షించి రవి మృతి చెందినట్లు నిర్ధారించారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అక్కడ నుండి మార్చురీలోకి తరలించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాలు అనారోగ్య సమస్యతోనే రవి ఆత్మహత్యకు కారణమైవుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. డిఎస్‌పి మహబూబ్ బాషా ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

ఆస్పరి, నవంబర్ 12, మరోఉదయం : ఆస్పరి మండ ల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఉమాదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపిటిసిలు అరకొరగా హాజరయ్యారు. కోరం తగినంత మంది రాకపోవడంతో సభ్యుల కోసం ఎంపిపి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్ప డింది. సమావేశానికి వచ్చిన అరకొర సభ్యులు కూడా ప్రజా సమస్యలను ప్రస్తావించడంలో విఫలమయ్యారు. ప్రజా ప్రతినిధులు హాజరు కావాల్సిన స్థానంలో కుటుంబ సభ్యులు హాజరు కావడం గమనార్హం. ఒక్క తంగరడోన ఎంపిటిసి నర్సన్న తప్ప మిగతా ఎవరూ ప్రజా సమస్య లను ప్రస్తావించేందుకు ముందుకు రాలేదు. నర్సన్న మా ట్లాడుతూ... ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు నష్టపరి హారం ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలని, బ్యాంకులో తీసుకున్న రుణం రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో సిడబ్ల్యుఎస్ స్కీం ఏర్పాటు చేసి తాగునీటి సమస్య రాకుండ పందికోన రిజ్వాయర్ నుంచి ఆస్పరి మండలానికి పైపు లైన్ ద్వారా నీటిని తీసుకొచ్చి గ్రామాలకు చేయాలని పేర్కొన్నారు.

## ప్రపంచ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి



అనంతపురం, నవంబర్ 12, మరోఉదయం : విద్యార్థులు భవిష్యత్‌లో ప్రపంచ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధపడాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు పిలుపునిచ్చారు. జెవివి నాయకులు గాంగేనాయక్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ సినర్జి పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ముందుగా చెకుముకి సంబరాలు-2023 ప్రశ్నపత్రాలను డిఇఓతోపాటు జెవివి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా చెకుముకి సంబరాల కార్యక్రమాన్ని జెవివి చాలా విజయ వంతంగా నిర్వహిస్తోందన్నారు. ఈ సంవత్సరం ప్రశ్నపత్రాన్ని తన చేత ఆవిష్కరిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పోటీ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం, వాటి పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. భాష వేరు కావచ్చు కానీ సిలబస్ అంతా ఒక్కటే కాబట్టి విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని అది హైస్కూల్ స్థాయి నుంచే మొదలవ్వాలని సూచించారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రపంచ సైన్స్ దినోత్సవం రోజున ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకప్పటి ప్రాచీన మానవుడు ప్రకృతిని చూసి బయపడే వాడని ప్రస్తుతం సైన్స్ అభివృద్ధి చెందిన తర్వాత అందులోని రహస్యాలను చేదించాడానికి సైన్స్ ప్రాధాన్యత పెరిగిందన్నారు. సైన్స్, శాస్త్రీయ పద్ధతి అంటే సరిగా ఆలోచించడం, నిర్ణయాలు తీసుకోవడం, ఆములు చేయడమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన, సీనియర్ నాయకులు డాక్టర్ వీరభద్రయ్య, స్కూల్ కరస్పాండెంట్ మధు, జెవివి నాయకులు రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, నూర్, ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించండి..మహాప్రభో..



తాడిపత్రి, నవంబర్ 12, మరోఉదయం : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని గన్నేవారిపల్లి పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు కడప రోడ్డు లోని రామాలయం వద్ద రూరల్ పరిధిలోని గన్నేవారిపల్లి పంచాయతీ కార్మికుకులు మోకాళ్లపై కూర్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకపోవడంతో పండగపూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటికే అప్పులు తెచ్చి కుటుంబాలు పోషించుకుంటున్నామని, ఇక అప్పులు కూడా పుట్టని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జీతాలు ఇవ్వాలని అధికారులు, పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఏమాత్రం స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా తమపై దయ ఉంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించడంతోపాటు నెలనెలా సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రాజు, సంధ్యాభాయి, రామకృష్ణ, అచ్చమ్మబాయి, కుళ్లాయప్ప, ఓబయ్య, భాస్కర, జిజె.బాయి, కుళ్లాయమ్మ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

## చలో విజయవాడ విజయవంతానికి 'అనంత' బాలల ప్రచారం

అనంతపురం, నవంబర్ 12, మరోఉదయం : కష్టం, నష్టం తెలియదు.. కల్లాకపటం తెలియని పసిపిల్లలు.. తమ భవిష్యత్తు ఎలా ఉండాలో తెలియకుండానే 'అసమానతలు లేని అభివృద్ధి చేయాలనే నినాదంతో ఇంటింటా తిరిగి చలో విజయవాడ బహిరంగ సభను జయప్రదం' చేయాలంటూ చిట్టి పొట్టి మాటలతో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. ఈనెల 15న సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ బహిరంగ సభను విజయవంతం చేయాలని నగరంలోని శ్రీశ్రీ నగర్‌లో చిన్న పిల్లలు ఇంటింటికీ తిరిగి అవ్వా.. సభకు వెళ్లాలి సిద్ధం కావాలి.. తాతా.. సభకు రావాలి.. అంటూ బుడిబుడి అడుగులు వేస్తూ ప్రచారం చేశారు. ఇందుకు ఓ వృద్ధురాలు సైతం స్పందిస్తూ బోసి నవ్వులతో 'సభకు వెళ్తా.. ఛార్జీలకు డబ్బులు ఇవ్వు పెద్దయ్యా..' అంటూ చలోక్తులు విసిరింది. ఇలా పిల్లలు కాలనీలోని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. సమయం దొరికితే స్నేహితులతో ఆటలు ఆడుకుందామనుకునే పిల్లలు ఇలా సమాజిక అభివృద్ధితో ముడిపడిన అంశాలపై ప్రచారం చేయడంతో కాలనీవాసులు పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు రోషిని, గగన్ తదితరులు పాల్గొన్నారు.



# మాట తప్పని ఏకైక ముఖ్యమంత్రి జగన్



పెద్దకడబూరు, నవంబర్ 12, మరోఉదయం : మాట ఇస్తే తప్పని వ్యక్తి ఏకైక ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. పెద్దకడ బూరులో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. షాదీఖానా భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరయ్యారు. ముందుగా స్థానిక ఎస్సీ కాలనీ నుంచి బస్టాండ్ వరకు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వివిధ గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బాలనాగరెడ్డి చేతులమీదుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి మరోసారి జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. జడ్‌పిటిసి జాము రాజేశ్వరి, మాజీ ఎంపిపి రఘురాం, జెసిఎస్ కన్వీనర్ రవిచంద్ర రెడ్డి, ఎంపిడిఒ ప్రభాకర్, సర్పంచి రామాంజనేయులు, కోసిగి మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ముక్కరన్న, కోసిగి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ బొగ్గుల అర్లప్ప పాల్గొన్నారు. మంత్రాలయంలోని సచివాలయం-2 పరిధిలో 'ఎపి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. అందుకు ముందు రాఘవేంద్ర సర్కిల్‌లో వైసిపి జెండాను వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి ఆవిష్కరించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, ఎంపిపి పి.రాఘవేంద్ర, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, మాజీ సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, నాయకులు శివకుమార్, బొంబాయి శివ, వీరయ్య శెట్టి, దామోదర్ గుప్తా, కోల్గేట్ రమేష్ పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకే 'చెకుముకి'



కోసిగి, నవంబర్ 12, మరోఉదయం : పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తిం చేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తు న్నట్లు జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య తెలిపారు. మండలంలోని కోసిగి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో, మౌంట్ కార్మెల్ ప్రయివేట్ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోసిగి ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ మాట్లాడారు. జెవివి చెకుముకి పోటీలు నిర్వహించడం కోసిగి ప్రాంతానికి శుభ పరిణామమని తెలిపారు. వెనుకబడిన కోసిగి ప్రాంత విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని, కుతూహలాన్ని కలిగిస్తోందని చెప్పారు. మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు సమాజం నుంచి తొలగిపోయి ప్రతి ఒక్కరి జీవితాల్లో శాస్త్రీయ భావజాలం ప్రతిఫలించినప్పుడే శాస్త్రీయ సమాజం ఆవిర్భవిస్తుందని తెలిపారు. అనంతరం జెవివి జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడారు. జెవివి ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రజల్లో సైన్స్ గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అంతయ్య, గురుస్వామి, వెంకటరెడ్డి, రవికుమార్, సుభాన్ సింగ్, రహీం, మేఘనాథ్, మహేష్, చంద్రశేఖర్, సులేమాన్ పాల్గొన్నారు. కౌతాళం మండలం ఎరిగేరి ఉన్నత పాఠశాలలో జెవివి, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ పర్యవేక్షణలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఉపాధ్యాయులు మాధురి, రాము, రేణుకమ్మ, వెంకటేశులు, అబ్దుల్ రహీం, బీరప్ప, రంగారెడ్డి, చిట్టిరాజు, లింగన్న, లీలావతి, రాజ్యలక్ష్మి, సుధారాణి, జయరాణి పాల్గొన్నారు. గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఎపి మోడల్ స్కూల్‌లో సుమారు 500 మంది విద్యార్థులకు చెకుముకి సైన్సు పరీక్షలు నిర్వహించారు. జెవివి సైన్స్ కోఆర్డినేటర్ కె.విజరు కుమార్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు గుమ్మల బాబు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఎపి మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ పద్మావతి, కస్తూర్బా గాంధీ విద్యాలయం ఇన్‌ఛార్జీ స్పెషల్ ఆఫీసర్ రాధా రాణి, ఉపాధ్యాయులు అక్బర్, అమానుల్లా బేగ్, మహబూబ్ బాష, తాజుద్దీన్, రామచంద్రరావు, భాస్కర్, మురళీకృష్ణ, ఉస్మాన్, రంగస్వామి, ఖాదర్ భాష, రవికుమార్, నాగజ్యోతి, మల్లేశ్వరమ్మ, ప్రమీల బాయి పాల్గొన్నారు.

# ఉరుకుందలో వేలం పాటలు



కౌతాళం, నవంబర్ 12, మరోఉదయం : జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంలో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో తలనీలాలు పోగు చేసుకోవడానికి, దేవస్థానం పాత పరిపాలన భవనం పడగొట్టడానికి వేలంపాటలు నిర్వహించారు. కర్నూలు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దేవాలయ సహాయ కమిషనర్ వాణి బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కు ఒక సంవత్సరకాల కాల పరిమితితో బహిరంగ వేలంలో నలుగురు పాల్గొన్నారు. రాజా ఎంటర్‌ప్రైజెస్ హిందూపూర్ వారు రూ.1,63,80,000 దక్కించుకున్నారు. దేవస్థాన పాత కార్యాలయ పరిపాలన భవనం పడగొట్టడానికి ఐదుగురు పాల్గొనగా కర్నూలు నగరానికి చెందిన సురేష్ కుమార్ రూ.3.44 లక్షలకు దక్కించుకున్నారు. ఈ వివరాలను దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపుతామని దేవాలయ సహాయ కమిషనర్ వాణి తెలిపారు. దేవాలయ పర్యవేక్షకులు రామ్మోహన్, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, దేవాలయ ఇన్‌స్పెక్టర్ వీరేష్ పాల్గొన్నారు.

# దళిత సమస్యలపై వివక్ష ఇంకెన్నాళ్లు..?




గోనెగండ్ల, నవంబర్ 12, మరోఉదయం : దళితులపై కొనసాగుతున్న ఆధిపత్య వర్గాల వివక్షతో పాటు అధికార వివక్షను కూడా తోడుగజేసి ఇంకెంత కాలం దళితులను సమస్యల అగాధంలో ఉంచుతారని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి. ఆనంద్ బాబు విమర్శించారు. గోనెగండ్లలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో డప్పు కళాకారుల సంఘం సమావేశం మండల కార్యదర్శి పెద్ద కర్రెన్న అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆనంద్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కరుణాకర్ హాజరయి మాట్లాడారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 73 ఏళ్లు పూర్తయినా నేటికీ దళితుల పట్ల సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. వార్షిక బడ్జెట్‌లో దళితులకూ కేటాయించాల్సిన నిధుల దగ్గర మొదలైన వివక్ష అన్నిచోట్లా కొనసాగుతోందని తెలిపారు. 2013 దాకా డప్పుకు ప్రభుత్వ గుర్తింపే లేదన్నారు. పోరాడి గుర్తింపు, పింఛన్లు సాధించినా వాటిని ఎలా తీసేయాలనే ఆలోచనలోనే ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. డప్పు కళాకారుల సంఘం మండల ఉపాధ్యక్షులు దేవదాసు, చిన్న కర్రెన్న, నరసింహుడు, ఆదాము, ఈరప్ప, చిన్న మద్దిలేటి పాల్గొన్నారు.

## మంత్రి జయరాం సహకారంతో గ్రామాభివృద్ధి



హొళగుంద, నవంబర్ 12, మరోఉదయం : మండలం లోని వందవాగిలిలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, నెరణికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైసిపి తాలూకా ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణస్వామి సహకారంతో గ్రామాభివృద్ధి చేసినట్లు వైసిపి సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్ ఎం.మెలిగిరి తెలిపారు. ఆయన మాట్లాడారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి మసీదు వరకు రూ.25 లక్షలతో మంత్రి జయరామ్ సహకారంతో సిసి రోడ్డు, డ్రెయినేజీ వేసినట్లు తెలిపారు. సిసి రోడ్డు పనులు పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు జయన్న, కె.లక్ష్మి కాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## జగన్‌తోనే సంక్షేమం



నందవరం, నవంబర్ 12, మరోఉదయం : రాబోయే కాలంలో కూడా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగనే కావాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. నందవరం సచివాలయం-2లో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా, కుల, మత, ప్రాంత, వర్గ, పార్టీల తేడా లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు శివారెడ్డి గౌడ్, లక్ష్మీకాంతరెడ్డి, విరుపాక్షి రెడ్డి, పేట శ్రీనివాస్ రెడ్డి, సర్పంచి తోట సావిత్రి, ఎంపిడిఒ దశరథ రామయ్య, వైసిపి నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, చాంద్ బాషా, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి పాల్గొన్నారు. కోసిగిలోని 1వ సచివాలయంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. మధ్యాహ్నం సచివాలయం-2లో 'సంక్షేమ పథకాల బోర్డు'ను ఆవిష్కరించారు. అనంతరం వైసిపి జెండాను మండల జెసిఎస్ ఇన్‌ఛార్జీ పి.మురళీమోహన్ రెడ్డి ఆవిష్కరించారు. సర్పంచి అయ్యమ్మ, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు నాడిగేని నరసింహులు, మహాంతేష్ స్వామి, ఎన్.నాగరాజు, బసిరెడ్డి, హొళగుంద కోసిగయ్య, ఉస్మాన్, బుల్లి నరసింహులు, పి.నాగేష్, ప్రవీణ్ కుమార్, సోఫీ, కాంట్రాక్టర్ నాగరాజు పాల్గొన్నారు. హాలహర్వి మండలంలోని బాపురం సచివాలయంలో వైసిపి మండల కన్వీనర్ భీమప్ప చౌదరి అధ్వర్యంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. మండల జెసిఎస్ కన్వీనర్ రంజిత్ కుమార్, సర్పంచి పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి


మంత్రాలయం, నవంబర్ 12, మరోఉదయం : రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమంతో అభివృద్ధి పనులు జరిగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండలంలోని చిలుకలడోన గ్రామంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లా రెడ్డి, మాజీ సర్పంచి హనుమంతు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా తిక్కారెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచి హనుమంతు, తిక్కయ్య, ఈరన్న, శివరాం, రంగన్న, ఆంజనేయ, ఎల్లప్ప, తోక హనుమంతు, రామకృష్ణ పాల్గొన్నారు. పెద్దకడబూరు మండలం మురవణి గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి తనయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. సత్యన్న గౌడ్, లారీల రంగన్న, చంటోడు, ఎంపిటిసి జాన్, సురేష్, యోహాన్, చెన్నకేశవులు, దస్తగిరి, నరసయ్య, తెలుగు యువత చెన్నకేశవ, వీరేష్ పాల్గొన్నారు.



# సర్వర్ మొరాయింపు

విశాఖపట్నం, నవంబర్ 12 మరోఉదయం : విశాఖపట్నం పాస్‌పోర్టు సేవా కేంద్రం(పీఎస్‌కే)లో దరఖాస్తుదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిర్లా జంక్షన్ సమీపానున్న బొత్స స్క్వేర్‌లో పీఎస్‌కే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆన్‌లైన్‌లో పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నవారు షెడ్యూల్ ప్రకారం స్లాట్ కేటాయించిన సమయానికి పీఎస్‌కేకి వెళ్లి అర్హత పత్రాలన్నీ సమర్పించాలి. ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఐరిస్, వేలిముద్రలు తీసుకున్నాక ఓకే చేసి పంపుతారు. పాస్‌పోర్టు సర్వర్‌తో ఇవన్నీ అనుసంధానమై ఉంటాయి. ఏ కారణం చేతనో పాస్‌పోర్టు సర్వర్ కొద్దికాలంగా పనిచేయడం లేదు. తరచూ మొరాయిస్తోంది. ఎప్పుడు కనెక్ట్ అవుతుందో తెలియక దరఖాస్తుదారులు అక్కడ గంటల కొద్దీ ఉండిపోవలసి వస్తోంది. రెండు, మూడు గంటలు చూసి...రీషెడ్యూల్ చేసుకోవాలని, మరోసారి రావాలని అక్కడి సిబ్బంది సూచిస్తున్నారు. విశాఖ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం పరిధి శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉంది. ఆయా జిల్లాల నుంచి ఇదే పనిపై వచ్చినవారు మళ్లీ అంత దూరం నుంచి రావాలంటే ఇబ్బంది అవుతోంది. దీనిని అధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. పోనీ సర్వర్ కనెక్ట్ అయ్యేంత వరకు వేచి ఉందామంటే...పీఎస్‌కే వెయిటింగ్ సదుపాయమే లేదు. ఆ భవనంలో కింద సెల్లార్‌లో నిలబడడానికి కూడా అంగీకరించరు. బయట ఎండలో ఉండాల్సిందే. వేల రూపాయల ఫీజు తీసుకుంటున్నప్పుడు దరఖాస్తుదారులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది. కానీ ఇక్కడి పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. సర్వర్ సమస్య ఉన్నప్పుడు ఫలానా దరఖాస్తుదారులు ఫలానా తేదీన రావద్దని, వారికి ఇంకో రోజున స్లాట్ కేటాయిస్తున్నామని చెప్పే అవకాశం ఉంది. కానీ అటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. ఇక్కడికి వచ్చి వెనక్కి వెళ్లిపోయి...దరఖాస్తుదారులే రీషెడ్యూల్ చేసుకోవాలని చెబుతున్నారు. వాస్తవానికి ప్రతిరోజు నిర్ణీత సంఖ్యలో స్లాట్లు ఇస్తారు. అంతకు మించి ఇవ్వరు. మరి రీషెడ్యూల్ చేసుకుంటే సమీప తేదీల్లో దొరికే అవకాశం లేదు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు గతంలో పత్రికలకు సమాచారం ఇచ్చేవారు. ఇటీవల కాలంలో అటువంటి సమాచారం ఏమీ రావడం లేదు. సర్వర్ సహా పలు సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని పాస్‌పోర్టు దరఖాస్తుదారులు కోరుతున్నారు.

# కరోనా ఖర్చులపై విజిలెన్స్




భీమవరం, నవంబర్ 12 మరోఉదయం : కరోనా సమయంలో వ్యాధిగ్రస్తుల కోసం ఖర్చుచేసిన బిల్లులపై విజిలెన్స్ శాఖ ఆరా తీస్తోంది.. మూడున్నర ఏళ్ల కిందటి తొలి కరోనా, తరువాత రెండో దశ కరోనా సమయంలో రోగుల కోసం ఖర్చు చేసిన లావాదేవీలను గత నెల నుంచి విజి లెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. దీంతో కొందరు అధికారులలో గుబులు మొదలైంది. రోగులకు క్వారంటైన్ నిర్వహణ, విశ్రాంతి, వసతి కల్పన, భోజనాలు, మంచినీళ్లు, బారికేడ్ల ఏర్పాట్లు వంటి ఖర్చులన్నీ మున్సిపాలిటీ తరపున వ్యయం చేశారు. తర్వాత ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులను సక్రమంగా ఖర్చు చేశారా లేదా అని విజిలెన్స్ బృందం తనిఖీలు చేపట్టింది. కొన్ని లక్షల్లో నకిలీ బిల్లులు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ తనిఖీలు ప్రస్తుతం భీమవరం మున్సిపాలిటీలో చేపట్టారు. తర్వాత మిగతా మున్సిపాలిటీలో కూడా ఆరా తియ్యనున్నారని సమాచారం. ప్రస్తుతం భీమ వరంలో తొలి దఫా విచారణకు గత నెల 26న కొందరు ఉద్యోగులను ఏలూరు పిలిపించారని తెలిసింది. ఈ తనిఖీలలో కొన్ని ఆసక్తికర అంశాలు వెల్లడైనట్టు తెలిసింది. షామియానా ఏర్పాట్లకు సంబంధించి ఒక బిల్లు 3 లక్షల పైగా ఉన్నది.. అయితే సదరు షామియనా యజమానిని విచారించినపుడు లక్షల్లో బిల్లు ఇచ్చినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారని చెబుతున్నారు. బారకేడ్ల ఏర్పాట్లలో కూడా అదనపు బిల్లులు నమోదయ్యాయి అంటున్నారు. భోజనా లకు సంబంధించి మున్సిపాలిటీలో కొంతమంది బాధ్యత తీసుకుని భోజనాలు వండి పెట్టడం, కొంతమంది దాతలు నుంచి తీసుకు వచ్చి రోగులకు ఆహారం అందించారు. అయితే ఒక హోటల్ దగ్గర భోజనం కొనుగోలు చేసినట్లు లక్షల్లో బిల్లు పెట్టారని విజిలెన్స్ శాఖ గుర్తించినట్లు చెబుతున్నారు. దీంతో హోటల్ యజమానిని కూడా విచారించినట్టు తెలిసింది. ఇలా గత 20 రోజులుగా విజిలెన్స్ శాఖ గోప్యంగా విచారణ కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. దీని తరువాత తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో కూడా బిల్లులపై విచారణ సాగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందింది. ఈ వ్యవహారంపై అధికారులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది.

# పాస్‌పోర్టు..పడిగాపులు

భీమవరం నవంబర్ 12 మరోఉదయం : భీమవరం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న పాస్‌పోర్టు కార్యాలయం వద్ద శుక్రవారం పాస్‌పోర్టు దారులు పడిగాపులు పడాల్సి వచ్చింది. పాస్‌పోర్టుకు సంబంధించి సర్వర్ సేవలు నిలి చిపోయాయి. కంప్యూటర్లు పనిచెయ్యకపోడంతో సేవలు నిలచిపోయాయి. ఈ పరిస్థితి దేశ వ్యాప్తంగా ఉందని సంబంధిత అధికారులు చెప్పడంతో వచ్చిన వారు ఖంగుతిన్నారు. విశాఖపట్నం, కాకినాడతో పాటు పలు ప్రాంతాల నుంచి పాస్‌పోర్టు రెన్యువల్స్‌కు, కొత్త పాస్ పోర్టుకు స్లాట్ వచ్చినవారు పడిగాపులు పడాల్సి వచ్చింది. తమ చేతుల్లో ఏమీలేదని సర్వర్ పనిచేస్తే తాము పనిచేస్తామని సిబ్బంది చెప్పడంతో అక్కడ వారు మిన్నకుండిపోయారు. యనమదుర్రు కాల్వగట్టుపై మధ్యాహ్నం వరకు వేచిచూసి చివరకు వెళ్లిపోయారు. దూర ప్రాంతాల నుంచి వచ్చామని మరోసారి రావా లంటే ప్రయాసతో పాటు ఖర్చు కూడా ఎక్కువ అవు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి స్లాట్ బుక్ చేసుకుని రావడమేనని వెళ్లిపోయారు.

# ప్రత్యేక స్పందనతో సమస్యలు త్వరగా పరిష్కారం



కొయ్యూరు, నవంబర్ 12 మరోఉదయం : ప్రజల సమస్యలను అత్యంత దగ్గరగా పరిశీలించి, వాటిని త్వరగా పరిష్కరించాలన్న ఉద్దేశంతో మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. కొయ్యూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జాయింగ్ కలెక్టర్ శివశ్రీనివాసు, ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం తరలివచ్చిందన్నారు. ప్రజలు ఇచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ, ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా అర్జీలకు త్వరగా మోక్షం కల్పించాలని సూచించారు. కాగా మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చి ప్రజలు 318 వినతులు సమర్పించారు. డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చాయి. రాజవొమ్మంగి మండలం వాతంగి గ్రామంలో నివసిస్తున్న 'భీమిరెడ్డి' ఇంటిపేరు గల వారు ఎస్‌టీలుగా (కొండరెడ్డి) చలామణి అవుతున్నారని, దీని వల్ల నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతున్నదని, అందువల్ల వారిని ఎస్‌టీ జాబితా నుంచి తొలగించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు వినతిపత్రం ఇచ్చారు. ఆడాకుల గ్రామంలో 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆయుర్వేద ఆస్పత్రి భవనం కూలిపోయిందని, తక్షణమే కొత్త భవనం నిర్మించాలని సర్పంచ్ కె.అప్పారావు అర్జీ అందజేశారు. కొయ్యూరు పంచాయతీ సంసద్ ఆదర్శ గ్రామంగా ఎంపికైనందున ఈ పథకం కింద ఏడు అభివృద్ధి పనులను ఎంపిక చేశామని, వాటికి అనుమతులు మంజూరు చేయాలని సర్పంచ్ బాలరాజు వినతిపత్రం ఇచ్చారు. ఏలేశ్వరం నుంచి రేవళ్లుకు నడుస్తున్న ఆర్టీసీ బస్సును దాకోడు వరకు పొడిగించాలని స్థానికులు అర్జీ ఇచ్చారు. చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీ కృష్ణాపురంలో యూపీ పాఠశాల ప్రహరీ గోడ, సెప్టిక్ ట్యాంక్, నీటి ట్యాంకు, మరుగుదొడ్లు జాతీయ రహదారి నిర్మాణంలో పోతుండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడతారని, అందువల్ల అవతల వైపున వున్న స్థలంలో నుంచి రహదారి నిర్మించాలని స్థానికులు అర్జీ అందజేశారు. రావణాపల్లి పంచాయతీ తోటలూరులో గ్రామ కంఠం కబ్జాకు గురైందని, ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కాకురు లక్ష్మి విజ్ఞప్తి చేశారు. కాకరపాడు- శింగవరం మధ్య రెండు వంతెనలు నిర్మించాలని, మంప పంచాయతీ పైడిపణుకులుకు రోడ్డు నిర్మించాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, ఐటీఐ ఏర్పాటు చేయాలని ఎంపీపీ రమేశ్‌బాబు వినతిపత్రం ఇచ్చారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు స్పందన కొనసాగింది.

# పర్యాటక కార్మికులు సమ్మెబాట



అరకులోయ, నవంబర్ 12 మరోఉదయం : పలు డిమాండ్లపై ఏపీటీడీసీ అధికారులతో టూరిజం కార్మికులు సుదీర్ఘంగా నిర్వహించిన చర్చలు విఫలం అయ్యాయి. దీంతో 11వ తేదీ (శనివారం) నుంచి సమ్మె చేస్తున్నట్టు కార్మికులు స్పష్టం చేశారు. అంతకుముందు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆర్‌డీ శ్రీనివాసరావు, డీవీఎం హరితలు అరకులోయలోని టూరిజం గోష్ఠిలో ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు టూరిజం కార్మికులు, నేతలతో పలు దఫాలు చర్చలు జరిపారు. కార్మికుల డిమాండ్లను మధ్యప్రదేశ్‌లో ఎన్నికల విధుల్లో ఉన్న టూరిజం ఎండీ కన్నబాబుకు ఫోన్ చేసి తెలియపరిచారు. ఈ సందర్భంగా కార్మికులు పలు అంశాలను ప్రస్తావించారు. 2010 అక్టోబరులో టూరిజం కార్మికులు సమ్మెకు పిలుపుఇవ్వడంతో ఏపీటీడీసీ అప్పటి సీఎండీ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చందనాఖాన్ స్పందించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే వరకు 'సమాన పనికి సమాన వేతనం' చెల్లించేందుకు, గ్రాట్యుటీ, పదోన్నతులు ఇచ్చేందుకు అంగీకారం తెలుపుతూ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. వీటిని 2017 వరకు అమలు చేశారు. అనంతరం 'సమాన పనికి సమాన వేతనం' చెల్లించకుండా కన్సాలిడేషన్ పేగా మార్పు చేశారు. దీనివల్ల కార్మికుల వేతనాలు తగ్గిపోయాయి. గత ఒప్పందాలను కొనసాగించాలంటూ కార్మికులు పలుమార్లు ఏపీటీడీసీ ఉన్నతాధికారులను కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. కార్మిక నేతలు గత ఏడాది రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబును కలిసి టూరిజం కార్మికుల సమస్యలు విన్నవించారు. ఆయన కార్మిక సంఘం నేతల సమక్షంలో రాష్ట్ర సచివాలయం అధికారులతో, విజయవాడలోని ఏపీటీడీసీ ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, నాడు చందనాఖాన్ ఇచ్చిన హామీల అమలుపై చర్చలు జరిపారు. మూడు నెలల్లో వీటిని అమలు చేస్తామని అధికారులు చెప్పారు. కానీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. దీంతో గత్యంతరం లేక సమ్మెకు దిగాల్సి వచ్చిందని టూరిజం కాంట్రాక్టు, మేన్‌పవర్, డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దీసరి గంగరాజు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు ఆర్‌ఆర్‌వీ నరసింహ, కార్యదర్శి అంజలీరావు, టోకూరు సర్పంచ్ మొష్యా, తదితరులు చెప్పారు. దీనిపై ఆర్‌డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, నాడు చందనాఖాన్ ఇచ్చిన హామీల అమలు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని, వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా బోర్డు మీటింగ్ పెట్టి వాటి అమలుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా కార్మిక సంఘాల నేతలకు తెలియపరిచారు. కానీ టూరిజం అధికారుల మాటలు నమ్మలేమని, తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని కార్మిక సంఘాల నేతలు స్పష్టం చేసి సమావేశం నుంచి బయటకు వచ్చారు. దీంతో శనివారం నుంచి తైడా జంగిల్ బెల్స్, బొర్రా గుహలు, అనంతగిరి హిల్ రిసార్ట్స్, అరకులోయలోని హరిత వ్యాలీ, మయూరి హిల్ రిసార్టులు, లంబసింగి రిసార్టులో పనిచేస్తున్న కార్మికులు సమ్మె చేయనున్నారు.

# కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో జాప్యం



విశాఖపట్నం నవంబర్ 12 మరోఉదయం : కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ ముందుకుసాగడం లేదు. పోస్టుల భర్తీ కోసం గత ఏడాది నవంబరులో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఏడాది జనవరిలో అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. ప్రాథమిక పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల మంది హాజరు కాగా తదుపరి దశకు 95 వేల మంది అర్హత సాధించారు. వీరికి శారీరక, దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అందులో అర్హత సాధించిన వారికి మెయిన్స్ రాత పరీక్ష నిర్వహించి, మెరుగైన మార్కులు సాధించిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలి. అయితే, అనివార్య కారణాలు వల్ల ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది మార్చిలో శారీరక, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం, ఆ తరువాత పోస్టుల భర్తీపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచిపోయింది. కోర్టు కేసు ఏమైందన్న సమాచారం లేకపోవడం, నియామక ప్రక్రియపై రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డు నుంచి ఎటువంటి ప్రకటన రాకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. వీలైనంత వేగంగా నియామక ప్రక్రియను ముగించాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. ఐదారేళ్లుగా కానిస్టేబుల్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు ప్రస్తుతం ఒకపక్క మెయిన్స్ పరీక్షకు, మరోపక్క శారీరక, దేహదారుఢ్య పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. నెలలు తరబడి ప్రాక్టీస్ చేస్తుండడంతో ఎంతోమంది గాయాల పాలయ్యారు. ఆలస్యమవుతున్న కొద్దీ మరింత మంది ప్రమాదాలు బారినపడి దేహదారుఢ్య పరీక్షలకు దూరమయ్యే ప్రమాదముందని అభ్యర్థులు వాపోతున్నారు. నెలల తరబడి ప్రాక్టీస్ చేస్తుండడం వల్ల శారీరకంగానూ అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 95 వేల మంది అభ్యర్థులు తదుపరి దశ కోసం నిరీక్షిస్తుండగా, ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు తొమ్మిది వేల మంది ఉన్నారు. విశాఖ నగర పరిధిలో 187, గ్రామీణ జిల్లా పరిధిలో 159 సివిల్ కానిస్టేబుల్ పోస్టులు ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా 2,520 ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి. గడిచిన ఐదేళ్ల నుంచి నోటిఫికేషన్ లేకపోవడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగాన్ని సాధించి ఇళ్లకు వెళ్లాలన్న లక్ష్యంతో వేలాది మంది విద్యార్థులు ఇళ్లకు దూరంగా చదువుకుంటూ ప్రిపరేషన్‌ను కొనసాగిస్తున్నారు. వీలైనంత తొందరగా కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పూర్తిచేయాలి. లాంగ్ జంప్, 1600, 100 మీటర్ల రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్న క్రమంలో ఎంతోమంది గాయపడ్డారు. రోజుల తరబడి విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి ఇబ్బందుల దృష్ట్యా నియామక ప్రక్రియను వేగంగా పూర్తిచేస్తే అభ్యర్థులకు ఎంతో మేలు కలుగుతంది. నోటిఫికేషన్ మధ్యలోనే ఉండడంతో ఇళ్లకు కూడా వెళ్లలేని పరిస్థితి.

# ఆగని మట్టి దందా..

పెదవేగి, నవంబర్ 12 మరోఉదయం : పోల వరం కుడికాల్వ గట్టు తరిగి పోతోం ది. మట్టి మాఫియా అక్రమ తవ్వ కాలకు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అందిన కాడికి దండుకుంటోంది. మండలంలో పోలవరం కుడికాల్వ గట్టు మట్టిని అనధికార అనుమ తులతో అక్రమంగా తవ్వేస్తూ లేఅవుట్లు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు పలుమార్లు అక్రమ తవ్వకాలను అడ్డుకుని, డంపర్లు, ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లలను అధికారులకు అప్పగించారు. అయినా అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. లక్ష్మీపురం, వంగూరు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్న సమాచారాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతమని ప్రభాకర్ గురువారం అర్ధరాత్రి అక్రమ తవ్వకాలను అడ్డుకుని రెవెన్యూ, పోలీస్‌లకు సమాచారం అందించారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దారు నల్లమిల్లి నాగరాజు, ఎస్ఐ ఎం.లక్ష్మణ్‌లకు పది డంపర్లు (భారీ టిప్పర్లు), రెండు ట్రాక్టర్లు, మూడు ఎక్స్‌కవేటర్లను అప్పగించారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం పదిగంటల వరకు పెదవేగి పోలీస్‌స్టేషన్ దగ్గరే అనుచరులతో వేచి ఉన్న చింతమనేని తక్షణం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# దాళ్వాకు దారేది?




ఏలూరు నవంబర్ 12 మరోఉదయం : గోదావరి ఒడ్డున కరువుఛాయలు చాన్నాళ్ల తర్వాత అలుముకున్నాయి. సార్వాలో ప్రతికూల వాతావరణం అడుగడుగునా అన్ని మండలాలను తాకింది. ఏలూరు జిల్లాలో 2 లక్షల 70 వేల ఎకరాల్లో సార్వా సాగు చేయాల్సి ఉండగా, ఈసారి రెండు లక్షల ఎకరాలకు పడిపోయింది. 70 వేల ఎకరాల్లో పంట ఛాయే కనిపించలేదు. పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సి ఉండగా ఆ స్థాయిలో ఎక్కడా దిశ, నిర్దేశం లేదు. పశ్చిమ డెల్టా ఆయ కట్టు ఏడు మండలాల్లో లక్షా ఆరు వేల ఎకరాల్లో పంట సాగు చేస్తారు. గోదావరి నుంచి సక్రమంగా నీరు కాల్వలకు విడుద లైతేనే ఇంత విస్తీర్ణంలో పంటకు రైతులు రంగంలోకి దిగుతారు. ఈసారి పరిస్థితి అంతంతమాత్రంగానే మారింది. వాస్తవానికి ఎన్నడూ లేని విధంగా ప్రకృతిలో విపరీత ధోరణి కనిపించింది. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో మండుటెండలు కాశాయి. భూగర్భ జలాలు పడిపోయాయి. మెట్టలో రైతులంతా బోర్ల మీద ఆధారపడే వ్యవసాయం చేస్తారు. భూమిలో తేమ శాతం అట్టడుగుస్థాయికి చేరింది. ఫలితం పంటకు నీరందని దైన్యం. కరువో, కాటకమో అంటూ రైతులు గగ్గోలు పెడుతుంటే ఆ పదమే నేరమన్న ట్టు వైసీపీ సర్కార్ కొందరి నోళ్లు మూయించింది. అధికార యంత్రాంగం రంగంలోకి దిగితే గాని 12 వేల ఎకరాల్లో వరి, పత్తి, మినుము, చెరకు వంటి పంటలు పూర్తిగా నష్టపోయినట్టు ప్రా?థమిక అంచనా వేయలేకపోయారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా వర్తింపచేసే విషయం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించే విషయం, పంట నష్టం తాత్కాలికంగా అందిం చడం వంటి ప్రధాన చర్యలను పక్కన పెట్టేశారు. పంట పండించిన రైతులంతా దాదాపు మూడొంతులు మంది కౌలు రైతులే. పంట పెట్టుబడి ఎకరాకు వేలల్లో కోల్పోయారు. అసలే అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తే వీరికి చివరికి మిగిలింది కష్టం, నష్టమే. కుక్కునూరు, వేలేరుపాడుల్లో పత్తి పంట నాశనమైంది. నీరు లేక నేలకరిచింది. ఒకప్పుడు ఇలాంటి కరువు ఛాయలను చూసిన మండలవాసులు తాజాగా జరిగిన నష్టాన్ని సర్కారుకు ఏకరువు పెట్టేందుకు ప్రయత్నిస్తే.. ఇవన్నీ పోలవరం ప్రాజెక్టు కింద సేకరించిన భూముల్లోని పంటలే. ఇప్పటికే ఆయా భూములకు పంట పరిహారం చెల్లించాం కాబట్టి ఇక కొత్తగా సీన్ లేదన్నట్టు ముఖాన చెప్పేస్తున్నారు. భూమిని నమ్ముకున్న రైతులు ఎప్పటి మాదిరి ఈసారి పంట వేసి నష్టం కొని తెచ్చుకున్నారు. ఈ మండలాల్లో రైతు కష్టం కాస్తా గోదారి పాలైనట్టే. ఓవైపు నష్టపరిహారం రాదు. పంటల బీమా వర్తించదు. సార్వాలో వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. నవంబరు మధ్య వారం నుంచి డిసెంబరు మొదటి వారంలోపే దాళ్వా ఆరంభం కావాలి. ఇప్పుడున్న పరిస్థితులు ప్రతికూలంగా మారినట్టు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలో గోదావరి కాల్వల కింద నాలుగు లక్షల 60 వేల ఎకరాల్లో ఆయకట్టు ఉంది. విభజిత జిల్లాల్లో ఒక్క ఏలూరు నుంచి దాళ్వా కింద లక్షా 20 వేల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది. వాస్తవానికి ఏలూరు జిల్లాలో అత్యధికంగా మెట్ట ప్రాంతం. అందువల్ల ఎర్రకాల్వ, తమ్మిలేరు, కొవ్వాడ కాల్వ ప్రాజెక్టుల నుంచి ఏటా 16 నుంచి 18 వేల ఎకరాల్లోపు సాగు నీటిని అందించే ప్రయత్నం చేస్తారు. ఆ మేరకు పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తారు. దాళ్వాలో ప్రతీసారి గోదావరిలో నీటి లభ్యత కొంత అపసవ్యంగానే ఉంటూ వచ్చింది. డిసెంబరు నుంచి మార్చి వరకు గోదావరిలో వరద నీటి లభ్యత 45 టీఎంసీలుగా ఉంటుంది. తాజా లెక్కల ప్రకారం ఇప్పటికే ధవళేశ్వరంలో నాలుగు టీఎంసీల నీరు నిల్వ ఉండగా, పోలవరం ప్రాజెక్టులో 14 నుంచి 16 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్నట్టు చెబుతున్నారు. దీనిని అంచనా వేసి ముందస్తుగా రైతులకు తాజా పరిస్థితులను వివరించి ఆ మేరకు పంట ఏ మాత్రం సాగు చేయాలి, వంతుల వారీ విధానం ఎలా అమలు చేయాలి, సీలేరు నుంచి ఎంత మేర జిల్లాలకు రాబట్టాలనే అంశంపై ప్రతీసారి పటిష్ట ప్రణాళిక అంటూ ఉంటూ వచ్చేది. ముందస్తుగానే నీటిపారుదల సలహా సంఘ సమావేశాన్ని ఏర్పాటుచేసేవారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కీలక నిర్ణయాలు తీసుకునేవారు. నాలుగేళ్లుగా ఈ సమావేశం ప్రాధాన్యత కోల్పోయింది. అధికారులు తీసుకున్న నిర్ణయాలకు ప్రజా ప్రతినిధులు తలూపే పరిస్థితి వచ్చింది. సార్వాలోనే కరువు తరుముకొచ్చి మెట్ట రైతు పూర్తిగా నష్టాల పాలయ్యాడు. ఇంత జరిగితే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ఒక్కరూ నోరెత్త లేదు. రైతుకు కాస్త విశ్వాసం కలిగేలా వారి దగ్గరకు వెళ్లి పరామర్శించనూ లేదు. బస్సు యాత్రలు, రాజకీయ కార్యకలాపాల్లో వీరంతా బిజీ. ఓట్లు సమయం దగ్గర పడుతున్న వేళ తమకేమీ కనపడదు. వినపడదనే ధోరణి. వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. మరో పక్క ప్రభుత్వానికి రైస్‌మిల్లర్లు నేటి వరకు బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించలేదు. దీంతో ధాన్యం కొనుగోలు పూర్తిస్థాయిలో జరుగుతాయా..? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యం ముమ్మరంగా వచ్చిన తరుణంలో పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ చేసి ఆయా రైసు మిల్లర్లకు ధాన్యం పంపించడానికి బ్యాంక్ గ్యారెంటీలు సకాలంలో సమర్పించకపోవడంతో రైతులతో పాటు అధికారులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాదీ ఆ సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ముందుగానే రైస్‌మిల్లర్లతో సమావేశం ఏర్పాటుచేసి బ్యాంక్ గ్యారెంటీలను సమర్పించి ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని సూచించినా మిల్లర్లు నవంబరు సగం రోజులు పూర్తి కావొస్తున్నా ఇప్పటి వరకు బ్యాంక్ గ్యారెంటీలను సమర్పించకపోవడం గమనార్హం. జిల్లాలో మొత్తం 100 రైసు మిల్లులు ప్రభుత్వం నుంచి ధాన్యం సేకరిస్తున్నాయి. వాస్తవానికి ఒక్కొక్క మిల్లు సామర్థ్యాన్ని బట్టి రూ. రెండు కోట్ల నుంచి రూ.ఐదు కోట్ల వరకు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలి. ఒకేసారి కోట్ల రూపాయలు చెల్లించాలంటే తమకు భారంగా పరిణమించిందని మిల్లర్లు చెబుతున్నారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com